31వ వసంతంలోకి

# చరకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

గురువారం 05 మార్చి 2026 పేజీలు : 8

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులకు జాతీయస్థాయి ప్రథమ ర్యాంకు




చరకలు విలేఖరి,కరీంనగర్, రూరల్, మార్చి, 04 : గణిత శాస్త్రంతో అద్భుతాలు సృష్టించవచ్చని మరియు సమాజంలో అగ్రగామిగా ఉండవచ్చని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి గారు స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ లో పాఠశాలకు చెందినటువంటి విద్యార్థులు ప్రతిష్ఠాత్మక చింతన మ్యాథ్స్ ఒలంపియాడ్ జాతీయ స్థాయి పోటీలలో అత్యుత్తమ ఫలితాలు సాధించడం పట్ల ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు గణిత శాస్త్రంలో పట్టు సాధించే విధంగా ప్రోత్సాహం అందించాలని మరియు గణిత శాస్త్రంలో వివిధ రకాల పోటీ పరీక్షలు నిర్వహించి ప్రతిభను వెలికితీయాలని వారు చెప్పారు. ఇటీవల కాలంలో ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ అయినా చింతన ఒలంపియాడ్ ఫౌండేషన్ వారు నిర్వహించిన టువంటి మాథ్స్ ఒలంపియాడ్ పరీక్షల్లో పాఠశాల చెందినటువంటి అత్యుత్తమ ప్రదర్శన మ విద్యార్థులకు సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.డి.సాత్విక్, 7వ తరగతి జాతీయ స్థాయి మొదటి ర్యాంకు, ఏ.రీతిక, 6వతరగతి a జి. సహాస్, రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకు కే.అతిథి కిషన్, 4వ తరగతి, ఏ.సాయి చందన, 5వ తరగతి , ఏం.శ్రేయాన్ కార్తీక్ 9వ తరగతి - జిల్లా స్థాయి ప్రథమ ర్యాంకు,అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలను అందజేసి భవిష్యత్తులోనూ మరిన్ని అద్భుత విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.





## సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా
# వార్డు సభ్యులు కృషిచేయాలి

### రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

చరకలు, విలేఖరి, వెల్గటూర్, మార్చి 4 : ప్రజల మద్దతుతో గెలిచిన గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు ఆయా వార్డుల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలను అర్హులైన పేదలకు అందేలా చూడాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. ధర్మపురి నియోజకవర్గం ధర్మారం ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జరిగిన గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల బలోపేతానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించా రని ఇందులో భాగంగానే ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కావలసిన ప్రణాళికలు తయారు చేసుకొని గ్రామాల పర్యటనకు వచ్చినప్పుడు వార్డుల్లో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని మంత్రి వార్డు సభ్యులను కోరారు.ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వార్డు సభ్యులు పనిచేయాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి బండి సంజయ్ పై
## మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్



చరకలు ప్రతినిధి కరీంనగర్ మార్చ్ 04 : రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలని ఆశించడం ఒక రాజకీయ పార్టీ గా మా హక్కు. ప్రజాస్వామ్యంలో నాయకత్వం ఎవరికి దక్కాలో నిర్ణయించేది బండి సంజయ్ కాదు. మరో వ్యక్తి కాదు. ప్రజలే న్యాయ నిర్ణేతలు..ప్రజాస్వామ్యంలో పదవులు శాశ్వతం కావు. అవి ప్రజల విశ్వాసంపై ఆధారపడి ఉంటాయి. ఈ దేశానికి పట్టిన గ్రహణం ఎవరో ప్రజలకు తెలుసు. గత 12 ఏళ్లుగా ప్రజలు ఎన్నో కష్టాలు అనుభవిస్తున్నారు. దేశాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టి తమాషా చూస్తున్నారు. దేశ సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టు పెట్టిన మీరా మాట్లాడేది..?మీరు అధికా రంలోకి వచ్చిన తర్వాత పరిపాలన వ్యవ స్థలు అస్తవ్యస్తంగా మారింది.. ప్రభుత్వ రంగ సంస్థలు తెగనమ్ముతున్నారు.ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి..పేదలను ఆదుకునే ప్రయత్నం చేయలేదు. విద్వేషాన్ని రెచ్చగొట్టి మైనార్టీ లను అణగారిన వర్గాలను బూచిగా చూపి మీరు అధికారాన్ని చెలాయిస్తున్నారు.. నిత్యం మతవిద్వేశాలు రెచ్చగొడుతూ రాజకీయం చేస్తున్నారు.కేంద్ర దర్యాప్తు సంస్థలను ఈడి సీబీఐ కేసులతో విపక్ష ప్రభుత్వాలను కూలుస్తు ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్న రాజకీయం మీది.దేశ ఐక్యత కోసం కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేసి దేశ ప్రజలకు ఐక్యతను చాటి మీ ప్రభుత్వానికి నిద్ర లేకుండా చేస్తున్న రాహుల్ గాంధీ గారిని విమర్శించడం ఆకాశం మీద ఉమ్మిస్తే మీ ముఖం మీదే పడుతుంది ఆ వాస్తవాన్ని బండి సంజయ్ తెలుసుకోవాలి.రెండు సార్లు ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రి అయి తెలంగాణ కు ప్రత్యేక నిధులు తీసుకురాని దద్దమ్మ బండి సంజయ్ మీ వ్యవహారశైలి మార్చుకోవాలి.

## డిజిటల్ విద్య బోధన విద్యార్థులకు చాలా ఉపయోగకరం

### జగిత్యాల అదనపు కలెక్టర్ బిఎస్.లత



చరకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 4 : వినడం ద్వారా నేర్చుకునే దాని కన్నా చూసి నేర్చుకోవడం ఎంతో మేలు చేస్తుందని అందువలన డిజిటల్ విద్య వలన విద్యార్థులు పాఠాలు బాగా నేర్చుకుంటారని అందువలన డిజిటల్ విద్య ఎంతో మేలు చేస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత అన్నారు. బుధవారం స్థానిక ఓల్డ్ హై స్కూల్ జగిత్యాల్ లో రోటరీ క్లబ్ మరియు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించినటువంటి రీయూ సేబుల్ మరియు వాసిబుల్ క్లాత్ సానిటరీ ప్యాడ్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడుతూ విద్యకు అసౌకర్యం కలగకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వారన్నారు. జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కొరకు కృషి చేస్తున్న రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమన్నారు. అనంతరం ఆరు లక్షల విలువచేసే సానిటరీ ప్యాడ్స్ జగిత్యాల అర్బన్ మండల పరిధిలోని ప్రభుత్వ మరియు జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదువుతున్న ఎనిమిది వందల మంది విద్యార్థినులకు పంపిణీ చేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్పర్సన్, కౌన్సిలర్లను సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ అరవ లక్ష్మి, మండల విద్యాధికారి చంద్రకళ, రోటరీ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏవీఎల్ ఎన్ చారి, రాజు, రోటరీ క్లబ్ సభ్యులు మంచాల కృష్ణ, టీవీ సూర్యం, బొడ్ల జగదీష్, పి ఆర్ టి యు టి ఎస్ జగిత్యాల్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయిని పెల్లి ఆనంద్ రావు, యాల్ల అమర్నాథ్ రెడ్డి, ప్రముఖ వైద్యులు స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులను కాపాడాలి

**-రహ్ వీర్ పథకం ద్వారా రూ.25 వేల పారితోషికం అందిస్తాం.**

**-జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్**



చరకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 4 : రోడ్డు ప్రమాదాల సమయంలో గాయపడిన వారికి తక్షణ సహాయం అందించి వారి ప్రాణాలను కాపాడే బాధ్యతగల పౌరులను (గుడ్ సమారిటన్స్) ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రహ్ వీర్ పథకం ద్వారా రూ.25,000 నగదు పారి తోషికం, ప్రశంసా పత్రం అందజేయ బడుతుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. బుధవారం ఎస్పీ మాట్లా డుతూ దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ప్రమాదం జరిగిన తొలి గంటను "గోల్డెన్ అవర్"గా పరిగణిస్తారని, ఈ సమయంలో బాధితులకు సమయానికి వైద్య సహాయం అందితే అనేక ప్రాణాలు రక్షించవచ్చని పేర్కొన్నారు. కానీ కొంతమంది పౌరులు పోలీస్ కేసులు ఉండొచ్చనే భయంతో గాయపడిన వారికి సహాయం చె యడానికి వెనుకంజ వేస్తున్నారని ఈ భయాలను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం "రహ్ వీర్ పథకం"ను అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకం ప్రకారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి ప్రాణాలను కాపాడిన వారికి ప్రభుత్వం రూ.25 వేల నగదు ప్రోత్సాహంతో పాటు ప్రశంసా పత్రం అందజేస్తుందన్నారు. సహాయం చేసిన వ్యక్తిపై ఎలాంటి చట్టపరమైన ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే 108 అంబులెన్స్ సేవలకు సమాచారం ఇవ్వాలని, సమీపంలోని ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆసుపత్రికి గాయపడిన వారిని తరలించాలని సూచించారు. ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించి ప్రాణాలను కాపాడే కార్యంలో భాగస్వామి కావాలని కోరారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన మంత్రి అడ్లూరి



**చురకలు,విలేఖరి,వెల్గటూర్,మార్చి 4 :** ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మారం మండలం వివిధ గ్రామాలకు చెందిన కళ్యాణ లక్ష్మీ,షాదిముబారక్ లబ్ధిదారులు 38 మందికి బుధవారం ధర్మారం ఎంపీపీ కార్యాలయంలో రాష్ట్ర సాంఘీక సంక్షేమశాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ 38లక్షల 4వేల 408 విలువచేసే చెక్కులను పంపిణి చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదప్రజల సంక్షేమ మే ధ్యేయంగా రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని, పేదింటి ఆడబిడ్డల పెళ్లిల్లకు కల్యాణలక్ష్మి పథకం ఎంతగానో ఉపయోగ పడు తుందని తెలిపారు.పేద ప్రజలు ఈపథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్,ఎంపీడీఓ సుమలత,మండలం లోని వివిధ గ్రామాల కు చెందిన సర్పంచ్ లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



**చురకలు ప్రతినిధి,కోరుట్ల, మార్చి,04 :** కోరుట్ల పట్టణంలోని 31వ వార్డులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌విందు కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా.సంజయ్ కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస విరమణ చేసి, పవిత్ర రమజాన్ మాసం యొక్క ఆధ్యాత్మికతను కొనియాడారు.రమజాన్ మాసం శాంతి,సహనం,దయ,సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. సమాజంలో పరస్పర గౌరవం ప్రేమాభిమానాలు పెంపొందాలని ఆకాంక్షించారు.అలాగే ప్రజలందరూ మతభేదాలు లేకుండా ఐక్యంగా,సఖ్యతతో జీవించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ముస్లిం మత పెద్దలు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిద్ధార్థ లాడ్జిలో యువకుడి హత్య..?ఆత్మహత్య..?



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట మార్చి 04 :** వేములవాడ పట్టణంలోని సిద్ధార్థ లాడ్జిలో యువకుడిది హత్య ఆత్మహత్య అనేది పోలీసులు తేల్చనున్నారు, వీర్నపల్లి మండలం అడవి పందిర గ్రామానికి చెందిన భూక్యమోహన్ (26) గా పోలీసులు గుర్తించారు.అద్దె గదిని తీసుకొని అచేతన స్థితిలో పడి ఉండడాన్ని చూసి లాడ్జి నిర్వాహకులు వేములవాడ పోలీసులకు సమాచారం ఇచ్చారు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పట్టణ సిఐ వీరప్రసాద్ ఎస్సై పరిశీలిస్తున్నారు.బంధువులకు సమాచారం ఇచ్చామని మరింత సమాచారం వారు వచ్చాక వెల్లడిస్తామని సీఐ వీరప్రసాద్ తెలిపారు.సంఘటన స్థలంలో ఇతరులకు సంబంధించిన వస్తువులమ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు, వాటి ఆధారంగా కేసును పోలీసులు సేదించనున్నారు.సంఘటన స్థలానికి డాగ్ స్కాడ్ క్లూస్ టీం ప్రత్యేక పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు.

# సోలార్ పవర్ ప్రచార వాహనం ప్రారంభించిన అడిషనల్ కలెక్టర్




**చురకలు ప్రతినిధి కరీంనగర్ మార్చి 4 :** ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంలో భాగంగా సోలార్ విద్యుత్ అవగాహన ప్రచార వాహనాన్ని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే కలెక్టరేట్ నుండి ప్రారంభించారు.'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు వివిధ పథకాలపై ప్రజల కు విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా టీఎస్ రెడ్ కో ఆధ్వర్యంలో జిల్లాలోని 16 మండలాల పరిధిలో ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం గురించి అవగాహన కల్పించనున్నారు.ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గృహ వినియోగదారులు తమ ఇంటి డాబాపై సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసుకొని ప్రతి నెలా 360 యూనిట్ల సోలార్ విద్యుత్ వరకు పొందవచ్చునని సూచించారు. ఈ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీ కల్పించనుందని తెలిపారు. మిగులు విద్యుత్ ను గ్రిడ్ కు ఇస్తూ అదనపు ఆదాయాన్ని కూడా పొందవచ్చని సూచించారు. ఈ పథకాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

# వైభవంగా ఉగ్ర నరసింహా డోలోత్సవం

## భక్తులతో కిటకిటలాడిన ధర్మపురి క్షేత్రం



రామ కిష్టయ్య సంగన భట్ల...

ధర్మపురి క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీనరసింహ, వేంకటేశ్వర బ్రహ్మోత్స వాలలో అంతర్భాగంగా బుధ వారం సాయంత్రం శ్రీ ఉగ్ర నారసింహుని తెప్పోత్సవ, డోలోత్సవాలను వైభవో పేతంగా నిర్వహించారు. సాయంత్రం 4గంటలకు క్షేత్ర సనాతన సాంప్రదాయ పద్ధతిలో ఉగ్రనారసింహ స్వామి ప్రధానాలయం నుండి వేదమంత్రోచ్ఛా టనల, మంగళ వాద్యాలతో, భక్తజనం తోడు రాగా స్వామి ఉత్సవ మూర్తులను జయజయ ధ్వనాలతో ఊరేగించి, బ్రహ్మ పుష్కరిణి లోనికి కోనేరు ఉత్తర ద్వారం గుండా వేంచేపు చేయగా, అప్పటికే కోనేటిలో సోపానాలపై ఆసీనులై వేచియున్న భక్తజనం తమ ఇష్ట దైవాన్ని ఘనంగా స్వాగతించారు. అజ్ఞాత భక్తునిచే ప్రత్యేక నూతన నిర్మిత, బహూకృత హంస రూపు బల్లకట్టుపై స్వామిని ఆసీనులజేసి కోనేటి నీటిపై అయిదు ప్రదక్షిణలు నిర్వహించారు. బ్రహ్మపుష్కరిణి సోపానాలపై నున్న భక్త జన సమూహం ప్రదక్షిణలను మెట్లపై నుండి అనుసరించారు. బుక్కా, గులాలు ఇత్యాది పూజా ద్రవ్యాలు ఉత్సవ మూర్తులపై చల్లి భక్తి శ్రద్ధలతో కైమోడ్పులిడి ప్రార్ధించారు. అనంతరం కోనేరు మధ్య భాగాన గల వేదికపైనున్న భోగ మటపంలోని ఊయలలో స్వామిని అసీనుల గావించి డోలోత్సవం విర్వహిం చారు. వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య భక్తులు ఇరుకైన మార్గం గుండా ప్రవేశించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి డోలు ఊగుచుండగా దర్శించిన భక్తులకు వేద పండితులు చతుర్వేద మంత్ర పఠనాలతో ఆశీస్సులు అంద చేశారు. జయజయ ధ్వానాలు మిన్నంటగా, పూజా ద్రవ్యాలను చల్లి భక్తులు తమ ఇష్ట దైవాన్ని కొలిచారు. అర్చకులు నంబి శ్రీనివాసాచార్య, రమణాచారి, వంశీ, అరుణ్ లచే భక్తులు తులసీ కంకణాలను కట్టించు కున్నారు. ఆధ్యాత్మిక ప్రాసంగికులు, పాలెపు చంద్రశేఖర శర్మ, ఓఝల నరహరి శర్మ ప్రశ్నగాలు, నరసింహ శతక పద్యాలు వినిపించారు. దేవ స్థానం ఈఓ శ్రీనివాస్ మార్గదర్శకత్వంలో, ట్రస్టు బోర్డు అధ్యక్షుడు జక్కు రవీందర్, సభ్యులు, సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ నేతృత్వంలో ఏర్పాట్లు చేయగా ధర్మపురి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాం నరసింహా రెడ్డి, ఎస్ ఐ మహేష్ నేతృత్వంలో జగిత్యాల జిల్లాలోని ప్రత్యేక పోలీసు బృందాలు, హోంగా ర్డులు, ఎలాంటి అవాంఛనీయాలు చోటు చేసుకోకుండా బందోబస్తు చర్యలు చేపట్టారు. ప్రత్యేక బస్సుల ద్వారా భక్తులను గమ్యాలకు చేర్చారు.

ఉగ్ర నారసింహునికి భక్తజన నీరాజనం

ధర్మపురి క్షేత్రంలో సనాతన సంప్రదాయరీతిలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో అంత ర్భాగంగా బుధవారం జరిగిన శ్రీ ఉగ్రనార సింహుని తెప్పోత్సవ, డోలోత్సవ కార్యక్రమాలలో భాగస్వాము లయ్యేందుకు అశేష భక్త జనం క్షేత్రానికి తరలి వచ్చారు. ఉదయా తూర్వం దేవాలయాలను తెరవగా, సంప్రోక్షణం అనంతరం దేవస్థానం వంశపారం పర్య యాజ్ఞికులు కందాళై పురుషోత్తమాచార్య, వేద పండితులు రమేశ శర్మ మార్గ దర్శకత్వంలో అర్చకులు నంబి శ్రీనివాసాచార్య, నేరేళ్ళ శ్రీనివాసాచార్య, హరినాథాచార్య, రమణాచార్య, మూర్తి, వంశీ కృష్ణ , కిరణ్, అరుణ్, అలంకృత లక్ష్మీ సమేత ఉగ్ర నారసింహుడు ఆలయాలలో, దేవస్థానం ఏసీ, ఈఓ శ్రీనివాస్ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్య అర్చనలు, నిత్య కల్యాణంతో పాటు పురుషసూక్త, శ్రీసూక్త, భూసూక్త, నృసూక్త, లక్ష్మీసూక్త, విష్ణుసూక్త, మన్యుసూక్త, సుదర్శన, విశ్వక్సేన, తిరుకల్యాణ మహోత్సవ వ్యాహృ కర్మణి ఆవాహిత సర్వ దేవతాహ్వానం, గరుడ, ఆళ్వారుల హవనం, లోక కళ్యాణార్ధం వ్యాహృతి హోమాది ప్రత్యేక క్రతువులను నిర్వహించారు. అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు, యాత్రికులు పరమ పవిత్ర గోదావరి నదిలో మంగళ స్నానాలు ఆచరించి, సుప్రభాత దర్శనానికి వివిధ ఆలయాల ముందు బారులు తీరి నిలుచున్నారు. అత్యధిక సంఖ్యలో భక్తులు కోడె మొక్కులు, వల్లుబండ, గండాదీపాది మొక్కులు తీర్చుకున్నారు. సహస్ర స్వర్ణ కమలార్చనలో పాల్గొన్నారు. సంతానార్ధం హోమగుండం వద్ద ప్రత్యేక పూజలు చేయించుకుని భగవదాశీస్సుల నొందారు. ప్రధానంగా ఉగ్ర నారసింహా లయంలో చాలామంది భక్తులకు పూనకం రావడం, తమ భవిష్య త్తును, మంచిచెడులను భక్తులు అడిగి తెలుసుకోవడం కనిపించింది. కాగా నారసింహుని తెప్పోత్సవ, డోలోత్సవాల సందర్భంగా ఆలయానికి గణనీయ ఆదాయం సమకూరింది. టికెట్ల ద్వారా, ప్రసాదాల విక్రయాల ద్వారా, అన్నదానం ద్వారా అదనపు ఆదాయం లభించినట్టు ఏసీ, ఈఓ శ్రీనివాస్ వివరించారు. ఉగ్ర నార సింహుని తెప్పోత్సవ, డోలోత్సవాల సందర్భంగా ఉదయా త్పూర్వం నుండి గోదావరిలో స్నానాలను సుదూర ప్రాంతాలకు చెందిన అశేష భక్తులు సంప్రదాయాచరణలో భాగంగా ఆచరించారు.

# తనయుడి పుట్టినరోజున సౌండ్ సిస్టం బహుకరణ



**చేవెళ్ల మార్చ్ 04 (చురకలు):-** చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) లో భాజపా చేవెళ్ల నాయకులు అతెల్లి మధుసూదన్ రెడ్డి సాహితీ దంపతుల కుమారుడు అనిరుద్ రెడ్డి జన్మదిన వేడుకలు విద్యార్థుల మధ్య నిర్వహిం చారు. ఈ సందర్భంగా రూ.20 వేల విలువైన సౌండ్ సిస్టమ్‌ను విద్యాలయా నికి అందజేశారు. విద్యార్థినుల విద్యా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సౌండ్ సిస్టమ్ ఉపయోగ పడుతుందని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థినులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ శ్వేత రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల అవసరాలను గుర్తించి సహకా రం అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల అభివృద్ధికి సమా జం నుంచి వస్తున్న మద్దతు ఎంతో ప్రో త్సాహకరమని పేర్కొన్నారు. బీజేపీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అతెల్లి అనంత్ రెడ్డి, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సంప్రదాయ సంగీత సంపదను పరిరక్షించాలి

**-సాహితీవేత్త డాక్టర్ నర్సయ్య**



**రామ కిష్టయ్య సంగన భట్ల...**

సంప్రదాయ సంగీత సంపదను పరిరక్షించు కోవడం ప్రతి భారతీయుని ధర్మబాధ్యత అని సాహితీవేత్త,కవి పండితులు,విశ్రాంత ప్రాచార్యులు డాక్టర్ సంగనభట్ల నర్సయ్య స్పష్టం చేశారు. ప్రాచీన ఆర్షవిద్యలకు, సనాతన సాంప్రదాయాలకు అనాదిగా పట్టుకొమ్మగా నిలిచిన ధర్మపురి క్షేత్రంలో శాస్త్రీయ సంగీత పరిరక్షణకు సమాజం ఏకమై కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. దేవస్థానం ఈఓ శ్రీనివాస్,అధ్యక్షుడు జక్కు రవీందర్ నేతృత్వంలోని ధర్మకర్తల ఆధ్వర్యంలో,శేషప్ప కళావేదికపై స్థానిక నాట్యమండలి సౌజన్యంతో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న నాదబ్రహ్మ త్యాగరాజ ఆరాధనోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన ప్రధానోపన్యాసం చేశారు.ఈ సందర్భంగా ఆయన ప్రసంగం కేవలం ఆరాధనోత్సవ సందర్భోపన్యాసంగా కాక,భారతీయ సంగీత సంస్కృతిపై విశ్లేషణాత్మక దృక్పథంతో కూడిన ఆవేదనాత్మక పిలుపుగా మారింది.ధర్మపురి క్షేత్రం కేవలం ఆలయ పరిమితి గల పుణ్య క్షేత్రమే కాదు; అది వేద ఘోషలతో, మంత్ర నాదాలతో,శాస్త్రీయ సంగీత స్వరాలతో పరిపుష్టమైన సాంస్కృతిక క్షేత్రం.ఇలాంటి ప్రదేశాలలో నిర్వహించే త్యాగరాజ ఆరాధనోత్సవాలు భక్తి, సంగీతం,సంస్కృతి అనే త్రివేణి సంగమాన్ని సాక్షాత్కరింప జేస్తాయి. మహనీయుల జయంతులు,వర్ధంతులు కేవలం ఆచారపరమైన ఉత్సవాలుగాక, వారి జీవన విలువలను పునఃస్మరణ చేసుకునే ఆత్మ పరిశీలనా సందర్భాలుగా ఉండాలని నర్సయ్య పేర్కొన్నారు. మహామహుల జీవితాలను స్మరించడం ఒక బాధ్యత; వాటిని ఆచరించడం ఒక సాధన అని ఆయన ఉద్ఘాటించారు.భక్తి, జ్ఞానం,వైరాగ్యాల సమన్వయ స్వరూపుడైన వాగ్గేయకారుడు కాకర్ల త్యాగరాజు జీవితం సంగీత సాధకులకు చిరస్మరణీయ మార్గదర్శకం.ఆయన కీర్తనలలో శ్రీరామభక్తి పులకింతగా ప్రవహించగా,వేదాలు,ఉపనిషత్తులు, ఆధ్యాత్మిక తత్త్వాలపై ఉన్న లోతైన అవగాహన తాత్విక గంభీరతను ప్రస్ఫుటం చేస్తుంది.ఉపనయనం అనంతరం తండ్రి బోధించిన వేదాధ్య యనం,తల్లి అలవర్చిన భక్తిగీతాల ప్రభావం బాల్యంలోనే ఆయన హృదయంలో భక్తి బీజాలను నాటింది. యౌవన దశలో పరమహంస రామకృష్ణానంద స్వామి ఉపదేశించిన రామ షడక్షరీ మంత్రం ఆయన ఆత్మ సాధనకు పునాది వేసింది. ఆ మంత్రశక్తి, నిరంతర నామస్మరణ, నియమబద్ధ జీవన విధానం కలసి ఆయనను నాదోపాసకుడిగా, అనంతరం నాదబ్రహ్మ స్వరూపుడిగా తీర్చిదిద్దాయి. త్యాగబ్రహ్మం విద్యాసాధనార్థం తిరువారూరునుంచి తిరువయ్యూరుకు వెళ్లి సంస్కృతభాష, వేదవేదాంగాలు ఆమూలాగ్రంగా అభ్యసించారు. సంగీతంలో శొంఠి వెంకట రమణయ్య వద్ద శిష్యరికం స్వీకరించి కఠోర సాధనతో ప్రావీణ్యం సంపాదించారు. గురుభక్తి, శ్రద్ధ,క్రమశిక్షణ, అంతర్ముఖత ఈ నాలుగు స్తంభాలపై ఆయన సంగీత ప్రతిభ నిర్మితమైంది. ఆయన జీవితంలో 96కోట్ల శ్రీరామనామ జపం విశేషమైన ఆధ్యాత్మిక ఘట్టం. నామ స్మరణ ద్వారా భగవద్దర్శనం పొందిన త్యాగరాజ స్వామిభౌతిక రాజాశ్రయాన్ని నిరాకరించి ఆత్మ సంతృప్తిని ఆశ్రయించారు. సంపాదనపై ఆశలేని,అధికార ప్రతిష్ఠలపై ఆకాంక్ష లేని జీవితం గడిపిన ఆయన త్యాగం,సత్యనిష్ఠ, దైవభక్తి సమన్వయ రూపం.పుష్యకృష్ణ పక్ష పంచమి నాడు ఆయన పరమపదించిన సందర్భంగా ప్రతి సంవత్సరం నిర్వహించే త్యాగరాజ ఆరాధనోత్సవాలు భక్తి సంగీతానికి మహా మంగళోత్సవాలుగా నిలుస్తున్నాయి.1907 సంవత్సరంనుంచి వివిధ రాష్ట్రాలలో నిరాటంకంగా కొనసాగుతున్న ఈ ఉత్సవాలు సంగీత సంప్రదాయ నిరంతరతకు నిదర్శనం. త్యాగరాజ కీర్తనలు కేవలం రాగరంజక గానసంపద కాదు; అవి ఆత్మాన్వేషణకు ఆహ్వానాలు, దైవానురక్తి ప్రకటనలు, నైతికతకు మార్గ సూచికలు.సంగీతం ద్వారా తత్త్వాన్ని, తత్త్వం ద్వారా జీవన విలువలను అవగాహన చేయించిన మహోన్నత సాధకుడు త్యాగరాజ స్వామి.కార్యక్రమంలో ప్రసంగించిన సంగీతరత్న కొరిడె నరహరిశర్మ వాగ్గేయకారుల సంగీత సంపద వేదాలవలె పవిత్రమని వ్యాఖ్యానించారు. వేదాలు యథార్థ జ్ఞానానికి మూలాధారాలు అయితే, వాగ్గేయకారుల కీర్తనలు భక్తి జ్ఞానానికి మార్గదర్శకాలు. ఈ ఆమూల్యమైన సంపదను సంరక్షించడం భారతీయులందరి ధర్మమని ఆయన స్పష్టం చేశారు.కళాకారులే సంస్కృతికి సంరక్షకులని,హిందూ ధర్మాన్ని, భారతీయ సాంస్కృతిక మూల్యాలను కళారూపాల ద్వారానే నిలబెట్టగలమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో త్యాగయ్యగా ఖ్యాతి పొందిన చాచం కిష్టయ్య గారి సేవలను ఈ సందర్భంగా స్మరించడం కార్యక్రమానికి స్థానిక గౌరవాన్ని చేకూర్చింది. ప్రాంతీయ స్థాయిలోనైనా త్యాగరాజ కీర్తనలను విస్తృతంగా ప్రచారం చేసి భక్తి సంగీతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన వారి కృషి స్మరణీయమని వివరించారు. స్థానిక వేద పండితులు, సంగీత విద్వాంసులు లక్ష్మీ సమేత నరసింహ, త్యాగరాజు,చాచం కృష్ణయ్యల చిత్ర పటాలను ప్రతిష్ఠించి నిర్వహించిన సంకీర్తన సభ భక్తిశ్రద్ధలను రేకెత్తించింది. డాక్టర్ నర్సయ్య త్యాగరాజ వేషధారణలో,కాకర్ల అనిల్ కుమార్ చాచం కిష్టయ్య వేషధారణలో పాల్గొనడం ఆరాధనోత్సవాలకు వైభవాన్ని చేకూర్చింది.దేవస్థానం శేషప్ప కళావేదికపై వేదపండితులు బొజ్జా సంతోష్,రాజగోపాల్శర్మ సాంప్రదాయ విధివిధానాలతో పూజలు నిర్వహించారు.సంగీతరత్న కొరిడె నరహరిశర్మ, బొజ్జా రేవతి, గంప సుష్మా, గౌడ శైలజ,అనంతకృష్ణ లతో కలిసి త్యాగరాజ ఘన పంచరత్న మాలికను గానం చేయడం సభలో ఆధ్యాత్మికానుభూతిని సృష్టించింది. ఆలయప్రాంగణమంతా సంగీతనాదాలతో మార్మోగి, భక్తజనుల హృదయాలను పరవశింపజేసింది.త్యాగరాజ కీర్తనల విశిష్టతను విశ్లేషిస్తే వాటిలో భక్తి,నైతికత, ఆత్మ పరిశీలన,సమాజోద్ధరణ అనే నాలుగు ధారలు ప్రవహిస్తున్నట్లు స్పష్టమవుతుంది.“నాదోపాసన”ను జీవనసాధనగా స్వీకరించిన త్యాగరాజ స్వామి సంగీతాన్ని భోగసాధనంగా కాక మోక్ష సాధనంగా చూశారు.రాజాశ్రయం పొందక పోవడం ఆయన ఆత్మ గౌరవానికి ప్రతీక.సంపాదనపై ఆశలేని జీవనం ఆయన వైరాగ్య స్వరూపతను సూచిస్తుంది.ఇవే విలువలు నేటి తరానికి అవసరమైన మార్గదర్శకాలు. ఆధునిక యుగంలో సంగీతం వాణిజ్య రంగంలో చిక్కుకుని వినోద పరిమితిగా మారుతున్న సందర్భంలో త్యాగరాజు లాంటి మహనీయుల జీవితం మనకు దిశానిర్దేశం చేస్తుంది. సంప్రదాయ శాస్త్రీయ సంగీతం వేదికలకే పరిమితం కాకుండా కుటుంబాలలో, విద్యాసంస్థలలో,ఆలయాలలో పరిపుష్టి చెందాలి. గురుకుల సంప్రదాయం వంటి క్రమబద్ధ సాధన పునరుద్ధరించాలి. సంగీతాన్ని వినోద మాత్రంగా కాక ఆత్మశుద్ధి సాధనంగా స్వీకరించాలి. సాంకేతిక మాధ్యమాల విస్తరణతో సంగీత ప్రచారం సులభమైందిగాని, సాధనలో అంతర్ముఖత తగ్గిపోతోంది. కఠోర సాధన, గురుభక్తి, నియమ శీలతలే శాస్త్రీయసంగీతానికి మూలాధారాలు.త్యాగరాజ ఆరాధ నోత్సవాలు కేవలం వార్షిక ఆచారాలుగాక, విలువల పునరుద్ధరణకు వేదికలుగా మారాలి. యువతకు భక్తిసంగీతంపై అవగాహన కల్పించేందుకు శిక్షణా శిబిరాలు, గాన సభలు,సాహిత్య చర్చలు నిర్వహించాలి. ధర్మపురి వంటి క్షేత్రాలలో జరిగే ఈ ఉత్సవాలు ప్రాంతీయ సాంస్కృతిక చైతన్యానికి నాంది పలుకుతున్నాయి. దేవస్థానం ఈఓ శ్రీనివాస్,అధ్యక్షుడు రవీందర్,సభ్యులు,నాట్యమండలి కార్యదర్శి,సంగీతరత్న కొరిడె నరహరిశర్మ,సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్,కళాకారులు అనంతకృష్ణ, రామయ్య,వేణుగోపాల్,కిషన్,అనిల్, అమర్,సంజీవ్,వెంకటేష్,సురేష్ తదితరుల భాగస్వామ్యం అభినందనీయం.సంప్రదాయ సంగీత సంపదను తరతరాలకు అందించడంలో ఇలాంటి సంస్థల పాత్ర కీలకం.సంగీతం శబ్ద బ్రహ్మ.స్వరూపం.అది మనస్సును పవిత్రం చేస్తుంది;వ్యక్తిని సంస్కరిస్తుంది; సమాజాన్ని శ్రేయోమార్గంలో నడిపిస్తుంది.త్యాగరాజుల వంటి మహనీయుల స్మరణ మనకు కేవలం గౌరవప్రద కర్తవ్యమే కాదు---జీవన విలువలను ఆచరణలో పెట్టే ప్రేరణ. సంప్రదాయ సంగీత పరిరక్షణ అంటే మన ఆత్మ స్వరూప పరిరక్షణ.డాక్టర్ నర్సయ్య పిలుపు సముచితం--- వాగ్గేయకారుల వారసత్వాన్ని నిలబెట్టాలి; భక్తి,జ్ఞానం,త్యాగం అనే త్రివేణిని జీవితంలో ఆచరించాలి;శాస్త్రీయ సంగీతాన్ని సంస్కృతి మూలాధారంగా భావించి పరిరక్షించాలి.అప్పుడు మాత్రమే భారతీయ సంస్కృతి తన మహిమాన్విత స్వరూపంతో తరతరాలకు వెలుగునిస్తూ నిలిచి వుంటుంది.

# మాజీ జడ్పీ చైర్పర్సన్‌కు ఆహ్వానం

**చురకలు విలేకరి, జగిత్యాల, మార్చి 4 :** జగిత్యాల పట్టణంలోని శ్రీగోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దశమ వార్షికోత్సవం, కళ్యాణ మహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ బుధవారం



విశ్వబ్రహ్మణ సంఘ నాయకులు మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్‌కు ఆహ్వాన పత్రికను అందించారు.ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట రమణ,నిరంజన చారి,కౌన్సిలర్ కోరుకంటి రాము పాల్గొన్నారు.

## శతాబ్దిక వృద్ధుడు లింగన్న మృతి

**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం మార్చి (04) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల కేంద్రం లో శతబ్ధిక వృద్ధుడు కంతి ల్యాద లింగన్న (105)బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందారు.అయన మృతి పట్ల పలువురు నాయకులు,గ్రామ ప్రజలు సంతపం తెలిపారు.లింగన్న కు సంతానం ఇద్దరు కుమారులు,20మంది మనవలు,మనవరాలు ఉన్నారు. మృతి పట్ల పలువురు నివాళులు అర్పించి అంతిమ యాత్ర లో పాల్గొన్నారు.



## విద్యుత్ సరఫరాలో అంతరాయం

**-ఇబ్రహింపట్నం విద్యుత్ శాఖ ఇంజనీర్ సతీష్**

**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం మార్చి (04) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని వేములకుర్తి 11 కెవి విధ్యుత్ సబ్ స్టేషన్ లో గురువారం విధ్యుత్ వైర్ల క్రింద ఉన్న చెట్ల కోమ్మల తోలగింపు సందర్భంగా ఫిడర్ పరిధిలో విధ్యుత్ అంతరాయం కలగనీందని బుధవారం ఎఇ సతిష్ తెలిపారు.ఉదయం 9: 30 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విధ్యుత్ అంతరాయం ఉంటుదని, బర్దిపుర్, ములరాంపుర్ విధ్యుత్ వినియెగ దారులు,రైతులు సహకారించాలని ఎఇ పెర్కోన్నారు.



## నూతన రాష్ట్ర అర్చక సమాఖ్య కన్వీనర్ మహేంద్రచారికి సన్మానం



**చురకలు, విలేఖరి,వెల్గటూర్,మార్చి 4 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రం శ్రీ రామభక్త ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో రాష్ట్ర అర్చక సమాఖ్య డిడిఎన్ నూతన కన్వీనర్ గా నియమితులైన నాగరాజు మహేంద్రచారిని బుధవారం వెల్గటూర్,ఎండపల్లి మండలాల ధూప దీప నైవేద్య అర్చక మండలశాఖ అధ్యక్షులు పర్వతగిరి ప్రశాంత్ శాస్త్రి ఆధ్వర్యంలో అర్చకులు ఘనంగా సన్మాణించారు.ఈ సందర్భంగా మహేంద్రచారి మాట్లాడుతూ డిడిఎన్ అర్చకుల సమస్యలతో పాటు అర్చక గుర్తింపు కార్డులు రాష్ట్ర దేవాదాయశాఖ అధికారుల ద్వారా ఐడీకార్డులు అందించే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారం లోఅర్చకులు తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వెల్గటూర్ ఉమ్మడి మండల డిడిఎన్ అర్చక సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ యువతి మృతి

**చురకలు విలేకరి,ధర్మపురి,మార్చి4 :** జగిత్యాల జిల్లా ధర్మపురి మండలానికి చెందిన ఓ యువతి(17) డిసెంబర్ 8తేదీన ఆత్మహత్యకు పాల్పడి మంగళవారం మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. జగిత్యాల జిల్లాలోని ఒ ప్రైవేటు జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్న యువతి ని జగిత్యాలలో నివాసం ఉండే కోలా మనోజ్ (22) అనే యువకుడు ఆ బాలికని ప్రేమ పేరిట వెంట పడుతూ వేధిస్తూ పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి మోసం చేశాడు. కొన్ని రోజుల తర్వాత అతడు పెళ్లికి నిరాకరిస్తూ తాను చేసుకోనని యువతి ని బెదిరించాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన యువతి డిసెంబర్ 8 వ తేదీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది.వెంటనే కుటుంబ సభ్యులు జగిత్యాల లోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ డాక్టర్ సలహామేరకు హైదరాబాదులోని యశోద హాస్పిటల్ కి తరలించారు.ఆ యువతి చికిత్స పొందుతూ 86 రోజులు మృత్యువుతో పోరాడి మృతి చెందింది.మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ధర్మపురి ఎస్ఐ గురకమహేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# మున్సిపల్ పాలకవర్గానికి అయ్యప్ప ఆశీస్సులుండాలి

**-మున్సిపల్ చైర్పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 4 :** అయ్యప్ప స్వామి శక్తి స్వరూపుడని ఆయన ఆశీస్సులు మున్సిపల్ పాలకవర్గానికి ఎల్లప్పుడూ ఉండాలని జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ కోరారు.జగిత్యాల అయ్యప్ప ఆలయంలో బుధవారం జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి -శ్రీనివాస్ దంపతులు,పట్టణ వార్డ్ కౌన్సిలర్లు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అయ్యప్ప సేవా ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో వేద బ్రాహ్మనోత్తముల ఆశీర్వచనాలతో వారిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా చైర్పర్సన్ వాణి మాట్లాడుతూ ఆలయంలోకి రాగానే మాకు గొప్పశక్తి వచ్చినట్లయిందని, ఆశక్తి అయ్యప్పస్వామి అని పేర్కొన్నారు. ఆలయంలో ప్రశాంతత,ఆనందం పొందామని తెలిపారు.అయ్యప్ప స్వామి ఆశీస్సులతో జగిత్యాల పట్టణ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, జగిత్యాల మున్సిపాలిటీ మరింత అభివృద్ధి చెందాలని,అందుకు అయ్యప్పస్వామి దీవెనలు మాకు ఉండాలని వాణి వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బోయిని పెల్లి ప్రశాంత్ రావు,కోరుకంటి రామ్, వారణాసి మల్లవ్వ తిరుమలయ్య, ఆరవ లక్ష్మి రాజు,మానపురి పవిత్ర మహేష్, అల్లాల సరిత రమేష్ రావు,గాజుల లావణ్య మహేష్, దయ్యాల చంద్రకళ శంకర్, బైర్నేని భాగ్య, కొండా రమ లక్ష్మణ్,మమత రామకృష్ణ రెడ్డి, పిట్ట ధర్మరాజు,క్యాదాసు నవీన్, సీనియర్ గురుస్వాములు బండారి లక్ష్మీనారాయణ ,నీలం దశరథ రెడ్డి,మానాల కిషన్, దిటి సతీష్,మార కైలాసం,శ్రీనివాస్, సంకోజీ వెంకట రమణ,పాంపట్టి రవీందర్, పూజారి లక్ష్మీపతి,అయ్యప్ప సేవా ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# రివర్స్ పంపింగ్ రైతులకు గొప్ప వరం

**చురకలు విలేకరి,మెట్పల్లి రూరల్,మార్చి 4 :** తెలంగాణ రాష్ట్రంలో నీటి వనరుల సమర్థ వినియోగానికి ముందుచూపుతో మాజీ సీఎం కెసిఆర్ తీసుకున్న రివర్స్ పంపింగ్ నిర్ణయం రైతులకు గొప్ప వరమని బిఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.బుధవారం మండలంలోని జగ్గాసాగర్,రామలచ్చక్క పేట వరద కాలువ వద్ద బిఆర్ఎస్ నాయకులు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రివర్స్ పంపింగ్ నిర్ణయ ఫలితమే నేడు పలు ప్రాంతాల్లో రైతులకు ప్రజలకు స్పష్టంగా కనిపిస్తోందని ఒకప్పుడు ఎండిపోయి నిస్సారంగా కనిపించిన పంటపొలాలు ,ప్రస్తుతం సాగునీరు అందడంతో పచ్చగా కళకళలాడుతున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.రాష్ట్ర అభివృద్ధి దృష్ట్యా చేపట్టిన ఈ రివర్స్ పంపింగ్ విధానం ద్వారా వరద కాలువలోకి నీటిని మళ్లించడం వల్ల నీటి కొరత తీవ్రంగా ఉన్న ప్రాంతాలకు ప్రాణా ధారంగా మారడం ముఖ్యంగా కోరుట్ల, వేములవాడ,చొప్పదండి నియోజకవర్గాల రైతులకు ఈ ప్రాజెక్ట్ ద్వారా సమృద్ధిగా సాగునీరు అందుతోందని రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే లక్ష్యంగా కెసీఆర్ తీసుకున్న నిర్ణయాలు ముందుచూపు నాయకత్వానికి నిదర్శనమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి,మాజీ మండల అధ్యక్షులు ముదం నర్సింలు,లక్కం మహిపాల్, పి ఆర్,కేసిరెడ్డి నవీన్,డాకూరి వెంకటేష్, కసాడి తిరుపతి,రాజు, రవి కార్యకర్తలు పాల్గొన్నారు.



# మాజీ కౌన్సిలర్ షాకీర్ ఆస్తులపై విచారణ జరపాలి

**-12వ వార్డు కౌన్సిలర్ సుమయ్య తభస్సుమ్ డిమాండ్**



**చురకలు ప్రతినిధి మెట్పల్లి,మార్చి 04 :** 12వ వార్డు మాజీ కౌన్సిలర్ షాకీర్ పదవిని అడ్డం పెట్టుకుని కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదించా రని, ఆయన ఆస్తులపై సమగ్ర విచారణ జరపాలని ప్రస్తుత 12వ వార్డు కౌన్సి లర్ సుమయ్య తభస్సుమ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గత 15 ఏళ్లుగా పదవిలో కొనసాగిన షాకీర్ ఎలాంటి వ్యాపారం లేదా ఇతర ఉపాధి లేకపోయినా భారీ మొత్తంలో ఆస్తులు సంపాదించారని ఆమె ఆరోపించారు. వార్డులో కొత్తగా ఇల్లు నిర్మించుకున్న వారి వద్ద నుంచి అర్బన్ హౌసింగ్ కాలనీలో ఇల్లు ఇప్పిస్తానని, విద్యుత్ మీటర్లు పెట్టిస్తానని, ఇంటి నంబర్లు ఇప్పిస్తానని, ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తానని, ప్రభుత్వ పథకాలు మంజూరు చేయిస్తానని చెప్పి పేద ప్రజల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని తెలిపారు.అలాగే ఖరీదైన కారు కొనుగోలు చేయడానికి డబ్బులు ఎలా సమకూరాయో వెల్లడిం చాలని ఆమె ప్రశ్నించారు.ఈ వ్యవహారంపై ప్రభుత్వం తక్షణమే విచారణ జరిపి,అక్రమంగా సంపా దించిన ఆస్తులను సీజ్ చేసి, పేదల నుంచి వసూలు చేసిన డబ్బులను తిరిగి వారికి అందజేయాలని సుమయ్య తభస్సుమ్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో శాంత, హసీనా, అనిత, సంగీత, జమీలా, రఫీకా, లక్ష్మి, ముంతాజ్ బేగం, బేగు, మాయ, మనీషా, జమాల్, చోటు, శశిపాల్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలు సాధించిన సుప్రియకు అభినందనలు



**చురకలు విలేకరి,మెట్పల్లి రూరల్,మార్చి 4 :** మెట్ పల్లి మండల వేంపేట్ గ్రామానికి చెందిన ఇప్ప జలంధర్ కుమార్తె సుప్రియ ఇటీవలే బ్యాంకింగ్ రంగంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో క్లర్క్, తెలంగాణ గ్రామీణ బ్యాంకులో పీఓ గా రెండు ఉద్యోగాలు సాధించగా బుధవారం గ్రామస్తులు పలువురితో పాటు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేంధర్ రెడ్డి సుప్రియ కు శాలువాతో సన్మానించి అభినందించారు. ఒకేసారి రెండు ఉద్యోగాలు సాధించి గ్రామంలో యువతకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. సుప్రియను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు వెళ్ళాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పల్లి శేఖర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ పుల్ల శేఖర్ గౌడ్,వార్డ్ మెంబర్లు, మిత్రబృందం తదితరులు పాల్గొన్నారు.

## ఐఎంఏ ఆధ్వర్యంలో ఘనంగా హోలీ పండగ



**చురకలు ప్రతినిధి కోరుట్ల,మార్చి 04 :** హోలీ పండగ సందర్భంగా (ఐఎంఏ) కోరుట్ల శాఖ ఆధ్వర్యంలో వైద్యులు మరియు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఐఎంఏ భవనంలో హోలీ పండగను ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించారు. రంగుల మధ్య స్నేహభావంతో పండగను జరుపుకుంటూ పట్టణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ సీనియర్ వైద్యుడు అనూప్ రావు, ఐఎంఏ అధ్యక్షుడు రేగొండ రాజేష్, జనరల్ సెక్రటరీ కట్కం జగదీశ్వర్, కోశాధికారి అన్వేష్, రవికిరణ్, మనోజ్ కుమార్, ఇంద్రనీల్, రమేష్, నరేష్, రాజేందర్, రాజేష్, సంతోష్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.మహిళా వైద్యులుగా స్వేతి అనూప్, అనూరాధ జగదీశ్వర్, జ్యోత్స్న, గీత ఇంద్రనీల్, శృతి, ప్రియాంక, దీప్తి, జయశ్రీ తదితరులు హాజరై కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించారు.

## ఎల్లమ్మ బోనాల్లో పాల్గొన్న మాజీ జడ్పీ చైర్పర్సన్



**చురకలు ప్రతినిధి,జగిత్యాల,మార్చి 4 :** జగిత్యాల రూరల్ మండలంలోని గుట్రాజ్పల్లె గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రె ణుక ఎల్లమ్మ బోనాల పండుగ వైభవంగా నిర్వహించారు. బుధవారం రేణుక ఎల్లమ్మ అమ్మవారిని మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బత్తిని మహేష్, ఉప సర్పంచ్ బత్తిని తిరుపతి గౌడ్, గుల్లపేట మాజీ సర్పంచ్ జక్కుల తిరుపతి, వెల్దుర్తి మాజీ సర్పంచ్ బుర్ర ప్రవీణ్ గౌడ్, నాయకులు కమలాకర్ రావు, కట్ల మోహన్, గుగ్గిళ్ళ శ్రీపాల్, పుడేటి లక్ష్మణ్, పోచ మల్లన్న, జంగా జలంధర్, గాదె శ్రీనివాస్, ఉరడి రాజమల్లు, జంగా లచ్చన్న, చిలువేరి మల్లేష్, బత్తిని తిరుపతి గౌడ్, సల్లూరి రవి గౌడ్, సల్లూరి తిరుపతి గౌడ్, సల్లూరి ఎల్లా గౌడ్, సల్లూరి గంగన్న, సల్లూరు లచ్చన్న గౌడ్, సల్లూరి సంతోష్ గౌడ్, సల్లూరి మహేష్ గౌడ్, గౌడ సంఘ నాయకులు, భక్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పుష్కర ఘాట్ల ఏర్పాట్ల పరిశీలన



**చురకలు విలేకరి,మల్లాపూర్,మార్చి 4 :** మల్లాపూర్ మండలంలోని వాల్గొండ,ధామ్‌రాజ్ పల్లి, ఓబులపూర్,మోగిలి పేట,వి.విరావుపేట గ్రామాల్లోని గోదావరి పుష్కరఘాట్ల ఏర్పాట్లను అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లోని గోదావరి నది తీరంలో పుష్కరాలకు వచ్చే భక్తుల అంచనా,వారి మౌళిక వసతులు,పార్కింగ్ తో పాటు భద్రత చర్యల్లో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు,తదితర ఏర్పాట్లను మెట్ పల్లి డీఎస్పీ రాములు, తహసీల్దార్,శ్రీనివాస్,ఎంపీడీవో,శ్రీకాంత్,ఎస్సై అనిల్ వివిధ శాఖల అధికారులు పర్యవేక్షించి పలు సూచనలిచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు,దరంషోత్ సురేందర్,ఎగ్యరపు లింబద్రి,తోట రాజారెడ్డి, కనుముల వెంకటేష్,గుగలవత్ రాజేందర్, ప్రజా ప్రతినిధులు కిరణ్,గోల్కొండ రమేష్, పంచాయతీ కార్యదర్శులు మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల కోసం పనిచేసేది...రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వమే

**-ఏఎంసీ చైర్మన్ షేక్ సాబేరా బేగం**
**-ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం**
**-సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మార్చి 04 :** ప్రజల కోసం పనిచేసేది తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వమేనని ఏఎంసీ చైర్మన్ షేక్ సాబేరా బేగం పేర్కొన్నారు.ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం బుధవారం ఘనం గా జరిగింది.ఈ సందర్భంగా ఏఎంసి చైర్మన్ షేక్ సాబేరా బేగం స్థానిక గ్రామ సర్పంచ్ కొండ రమేష్‌గౌడ్ ఎంపీడీవో సత్తయ్యను మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు దోమ్మాటి నరసయ్య,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి ఎఎంసి వైస్ ప్రసిడెంట్ గుండాడి రాంరెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులను ఉపసర్పంచ్ వార్డు సభ్యులను ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు బైరి శోభ రాజిరెడ్డి బుధవారం ఆహ్వానించారు.వారి ఆహ్వానం మేరకు బుధవారం వెళ్లి ఏఎంసి చైర్మన్ షేక్ సాబేర బేగం స్థానిక సర్పంచ్ కొండ రమేష్ గౌడ్‌లు రిబ్బన్ కత్తిరించి గృహప్రవేశం చేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారు బైరి శోభ రవీందర్ రెడ్డి లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంజూరు చేసిన ఐదు లక్షల రూపాయలతో తాను ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోగలిగినానని ముఖ్యమంత్రి కి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులకు బైరి శోభ రవీందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ళను గృహప్రవేశం చేయడం జరిగిందన్నారు.అర్హులైన వారి అందరికీ ఎక్కువశాతం పెద్ద గ్రామ మైనందున రెండవ విడుత ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించాలని కోరారు. సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట మండలానికి 648 ఇందిరమ్మ ఇల్లు మొదటి విడుత మంజూరు అయ్యాయని అందులో 510ఇల్లు స్లాబ్ లెవల్‌కు వచ్చినాయని నియోజకవర్గంలో చకచక జరుగుతు న్నాయని ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశాలు చేసిన లబ్ధిదారులకు తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరిట సారేగా సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి తన సంత ఖర్చులతో త్వరలో ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి,గ్రామశాఖ అధ్యక్షులు గుడ్ల శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ నాయకులు సాహెబ్ మర్రి శ్రీనివాస్ రెడ్డి గోగూరి శ్రీనివాస్ రెడ్డి బండారి బాల్రెడ్డి మెండే శ్రీనివాస్‌యాదవ్, సాయి ప్రేమ్ గుర్రాల రాజిరెడ్డి వంగ శ్రీకాంత్ రెడ్డి అందె బాబయ్యవార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు. గృహప్రవేశం సందర్భంగా ఇందిరమ్మ లబ్ధిదారుకు విందు భోజనం ఇచ్చారు.

# పెద్దపల్లి రెసిడెంట్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మార్చి 4 :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అమర్‌చంద్ కళ్యాణ మండపంలో నిర్వహించిన పెద్దపల్లి రెసిడెంట్ టీచర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో 2026-28 రెండేళ్ల కాల పరిమితికి గాను నూతన కార్యవర్గాన్ని బుదవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అసోసి యేషన్ అధ్యక్షులుగా మెతుకు తిరుపతి, ఉపాధ్యక్షులుగా నీలం నరేందర్,తాళ్ళ నరేందర్,ప్రధాన కార్యదర్శిగా సట్టు కనకయ్య,ఆర్థిక కార్యదర్శిగా కర్రె ప్రవీణ్,ప్రచార కార్యదర్శిగా అలుగం కనకయ్య, గౌరవ అధ్యక్షులుగా వాలుక హనుమంతు,గౌరవ సలహాదారుగా చాట్ల ఆగయ్య,కార్యవర్గ సభ్యులుగా ఒల్లే శ్రీనివాస్‌యాదవ్,రామగిరి స్వామి, వడ్డేపల్లి రాజేషం,కర్నె రాజు,సుంకే నర్సింగంలు నియమితులయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మెతుకు తిరుపతి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు .పెద్దపల్లిలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయులందరినీ ఒక్క తాటిపైకి తెచ్చి,వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన ప్రకటించారు.ఈ ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించిన ఎన్నికల అధికారి హనుమంత్‌కు,సహకరించిన పెద్దలకు,కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి పలువురు ఉపాధ్యాయులు పూలమాలలు వెసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# రాజ్యసభలో సీఎం రేవంత్ రెడ్డి మాదిగలకు ఒక సీటు ఇవ్వాలి

**-ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షులు కానాపురం లక్ష్మణ్ మాదిగ**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట మార్చి 04 :**

తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ సీట్లలో సీఎం రేవంత్ రెడ్డి మాదిగలకు ఒక సీటు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయాన్ని పాటించాలని ఎమ్మార్పీఎస్ ఎం.ఎస్.పి ఎల్లారెడ్డిపేట వీర్నపల్లి ఉమ్మడి మండల ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం డిమాండ్ చేసింది.ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ వీర్నపల్లి మండల అధ్యక్షులు గద్దరాశి భగవంతశీ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు కానాపురం లక్ష్మణ్ మాదిగ మాట్లాడుతూ ఈనెల మొదటి వారంతో తెలంగాణ రాష్ట్రంలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ సీట్లలో కాంగ్రెస్ పార్టీ మాదిగల ఒకటి ఇవ్వాలని విజ్ఞప్తిచేస్తున్న డిమాండ్ చేస్తున్నాం.2024 లో జరిగిన పార్లమెంట్‌ఎన్నికలలో మూడు ఎస్సి రిజర్వుడు లోకసభ స్థానాలు ఉంటే కాంగ్రెస్ పార్టీ ఒకటి కూడా మాదిగల కు కేటాయించలేదు మాకు లోకసభలో ప్రాతినిధ్యం లేకుండా పోయింది తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన కులం మాదిగలు అయితే ఆ మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ద్రోహం చేసింది అని తెలియజేస్తున్నాం ప్రస్తుతం రాజ్యసభలోనైనా మాదిగలకు సీటు కేటాయించాలని లేకపోతే మాదిగల అగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించడం జరుగుతుంది ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి గారికి సామాజిక న్యాయం కాపాడే అవకాశం వచ్చిందని మాదిగల తరపున గుర్తు చేస్తున్నాం. ఇప్పటికే లోకసభలో ఏడుగురు రెడ్లు ఉన్నా కూడా రేపు రాజ్యసభకు కూడా పోటీ పడుతున్నారు ఖాళీ అయ్యే రెండి ట్లో ఒకటి మాదిగలకు ఇచ్చి రెండోది ఎవరికి ఇచ్చుకున్నా మాకు అభ్యంతరం లేదని తెలియజేస్తున్నాం.ఈ కార్యక్రమం లో వద్లూరి రాజాం మాదిగ ఎం ఎస్ పి వీర్నపల్లి మండల అధ్యక్షులు తాటి పెల్లి నరసయ్య మాదిగ ఎమ్మార్పీఎస్ ఎల్లారెడ్డిపేట మండల ఉపాధ్యక్షులు బి రాజేష్ మాదిగ ఎమ్మార్పీఎస్ వీర్నపల్లి ఉపాధ్యక్షులు సీనియర్ దేవదాసు మాదిగ నాయకులుమల్లారం రాజయ్య మాదిగ ముక్క మధు మాదిగ జాల పెల్లి దేవయ్య మాదిగ కత్తెరపాక అశోక్ మాదిగ శంకర్ మాదిగ శ్రీనివాస్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు మహిళ వివో బిల్డింగ్‌ల నిర్మాణాలకు భూమి పూజ



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మార్చి 04 :** ఎల్లారెడ్డిపేట మండలం బండ లింగంపల్లి గ్రామంలో వైభవలక్ష్మి సరస్వతి వెన్నెల సంతోషిమాత మహిళ వివో గ్రూప్‌ల బిల్డింగ్ నిర్మాణాలకు బుధవారం బండ లింగంపల్లి సర్పంచ్ బాలరాజు నరసగౌడ్ భూమి పూజ చేశారు.ఈ బిల్డింగ్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిన మంత్రివర్యులు పోన్నం ప్రభాకర్ గౌడుకు స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్‌కు జిల్లా కలెక్టర్‌కు సర్పంచ్ బాలరాజు నరసగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ బాలరాజు నరసగౌడ్ మాట్లాడుతూ నాలుగు విఓ బిల్డింగు నిర్మాణాలను రెండు నెలలలోపు పూర్తి చేయడం జరుగుతుంద న్నారు.అనంతరం మహిళా గ్రూపులకు మీటింగ్ హాలు కూడా మంజూరు చేయిస్తానని ఆయన మహిళలకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొడ్డురాజు మాచర్ల కిషన్ ఎల్లం మారుపు దయాకర్ రెడ్డి బాలచందర్ రెడ్డి పాలకవర్గం వివో గ్రూప్ మహిళా సంఘాల సభ్యులు గ్రామప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పెన్నులు పంపిణీ



**చురకలు విలేఖరి వీణవంక మార్చి 04 :** తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ఆధ్వర్యంలో వీణవంక మండలం,మామిడాలపల్లి ఎలబాక, గంగారం ఘన్ముక్ల, పోతిరెడ్డిపల్లి తో పాటు వివిధ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేసారు."సోల్జర్‌కు గన్ను-స్టూడెంట్‌కు పెన్ను" అనే నినాదంతో శ్రీ సురేష్ ఆత్మారామ్ మహరాజ్ స్ఫూర్తితో ఈ కార్యక్రమం చేపట్టబడింది.ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త,యోగా మాస్టర్ దేవనూరి శ్రీనివాస్ ప్రముఖ న్యాయవాది,యాదవ చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కుల శ్రీనివాస్ వీణవంక మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు సరస్వతి కటాక్షం కలిగిన పెన్నులు పంపిణీ చేశారు. రాబోయే పబ్లిక్ పరీక్షలను ధైర్యంగా,ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనాలని విద్యార్థులకు ఆయన సూచించారు.విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే క్రమశిక్షణ, పట్టుదల అవసరమని పేర్కొన్నారు.ఈ సహాయం వారి విద్యాభ్యాసానికి దోహదపడాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల ఎంఈఓ సుద్దాల శోభారాణి,ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈఆర్‌సీ చైర్మెన్‌కు స్వాగతం పలికిన కలెక్టర్,ఎస్పీ



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మార్చి 04 :** జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో తెలంగాణ ఈఆర్‌సీ బుధవారం నిర్వహించిన బహిరంగ విచారణకు హాజరైన తెలంగాణ ఈఆర్ సీ చైర్మెన్ డాక్టర్ జస్టిస్ డీ నాగార్జున,కే రఘు,ఈఆర్ సీ టెక్నికల్ విభాగం సభ్యుడు,సీ హెచ్ శ్రీనివాస్‌రావు,ఈఆర్‌సీ ఫైనాన్స్ విభాగం సభ్యులకు కలెక్టర్ గరిమ అగ్రవాల్,ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డంనగేష్ స్వాగతం పలికారు.ఈ సందర్భంగా వారికి పుష్ప గుచ్ఛం అందజేసారు.కార్యక్రమంలో సెస్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# నేరేళ్ల బాధితుల ఇంటికెళ్ళి పరామర్శించిన తీన్మార్ మల్లన్న

**-2017లో పోలీస్ దాడిపై న్యాయం చేయాలని డిమాండ్**
**-హామీలు ఇచ్చి మర్చిపోయిన నేతలపై బాధితుల ఆవేదన**
**-న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తాం..**
**-రేపటి మా ప్రభుత్వంలో ఎస్పీ విశ్వజిత్ కంపాటి, ఎస్సై రవీందర్ తాట తీస్తాం అని హెచ్చరిక**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మార్చి 04 :** రాజన్న సిరిసిల్ల జిల్లా నేరేళ్ల గ్రామంలో 2017లో జరిగిన పోలీస్ హింస ఘటనలోని బాధితులను తెలంగాణ రాజ్యాధికార పార్టీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నేడు వారింటికి వెళ్లి పరామర్శించారు.ఆ సమయంలో జరిగిన ఘటనలో పోలీసులు అమానుషంగా థర్డ్ డిగ్రీ ఇచ్చారని బాధితులు గుర్తుచేసుకుంటూ తమకు ఇప్పటికీ న్యాయం జరగలేదని ఏ ప్రజా ప్రతినిధి కూడా తమను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**2017 ఘటనపై బాధితుల వేదన..!**

2017లో ఇసుక లారీ దహనం ఘటన కేసులో నేరెళ్ల గ్రామానికి చెందిన పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకుని దాదాపు ఐదు రోజుల పాటు పోలీస్ స్టేషన్లో ఉంచి థర్డ్ డిగ్రీ పద్ధతిలో చిత్రహింసలు పెట్టినట్లు బాధితులు తెలిపారు. ఆ సమయంలో జరిగిన దారుణ ఘటన రాష్ట్రవ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.ఐతే ఈ ఘటనను కాంగ్రెస్,బీజేపీ నేతలు రాజకీయం వాడుకొని అధికారంలోకి వచ్చారు గాని తమకు ఇప్పటి వరకు న్యాయం చేయలేదని,కారకులపై చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**హామీలు ఇచ్చి అమలు చేయలేదని ఆరోపణ**

బాధితులు మాట్లాడుతూ గతంలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి తమను కలిసి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బాధ్యులైన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకుంటామనిహామీ ఇచ్చారని చెప్పారు.కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు వాపోయారు.అలాగే లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీ నాయకుడు బండి సంజయ్ కూడా తమకు న్యాయం జరిగే వరకు తమ పక్షాన నిలబడతానని హామీ ఇచ్చారని, కానీ ఎంపీగా గెలిచి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత కూడా తమకు న్యాయం చేయడం కొరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితులు పేర్కొన్నారు.

**పోలీస్ అధికారులపై చర్యలు కోరిన బాధితులు**

ఈ ఘటనలో అప్పటి ఎస్పీ విశ్వజిత్ కంపాటి,ఎస్ఐ రవీందర్ పాత్రపై పూర్తి విచారణ జరిపి ఆ ఇద్దరిపై మారుతి మిగతా పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు తీన్మార్ మల్లన్నను కోరారు. తమను రాజకీయంగా ఉపయోగించుకొని తరువాత పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రభుత్వానికి మల్లన్న హెచ్చరిక**

ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ నేరెండ్ల ఘటన బాధితులకు తక్షణ న్యాయం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు.ఈ కేసులో బాధ్యులైన పోలీస్ అధికారులపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.బాధితులకు న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తి ప్రభుత్వం నుంచి సమాధానం కోరుతానని హామీ ఇచ్చారు.

**ఉద్యమం కొనసాగుతుందన్న సంకేతం**

నేరెండ్ల ఘటనపై న్యాయం జరిగే వరకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ బాధితుల పక్షాన నిలబడుతుందని మల్లన్న స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం జరిగేలా అన్ని వేదికలలో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు,



# సైబర్ క్రైమ్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి**



**చురకలు విలేఖరి వీణవంక మార్చి 04 :** వీణవంక మండల కేంద్రంలో బుధవారం వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి ఆధ్వర్యంలో ప్రజల కు సైబర్ క్రైమ్ పై పోలీసులు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు సైబర్ క్రైమ్ వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటిపి వ్యక్తిగత సమాచారం అడిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.సైబర్ క్రైమ్ గురైతే వెంటనే పోలీసుల కు 1930 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.గ్రామంలో అనుమానితులు చెదిగితే వెంటనే 100 డయల్ చేసి సమాచార ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

# వీణవంకలో ఘనంగా హోలీ సంబరాలు



**చురకలు విలేఖరి వీణవంక మార్చి 04 :** వీణవంక మండల కేంద్రంలో తో పాటు గ్రామాలలో బుధవారం రంగుల పండుగ సందర్భంగా హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి. చిన్నా పెద్ద అనే తేడా లేకుండా ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. ఈ హోలీ వేడుకల్లో అన్ని వర్గాల ప్రజలు,ఆటో యూనియన్ సభ్యులు వేడుకల్లో పాల్గొన్నారు.పలువురు మండల ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

# మినిస్టర్ పొన్నం క్యాంప్ కార్యాలయం వద్ద మిన్నంటిన హోలీసంబరాలు





**చురకలు ప్రతినిధి కరీంనగర్ మార్చి 4 :** హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నగరంలోని పొన్నం కాంప్లెక్స్ లోని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంపు కార్యాలయం వద్ద హోలీ సంబరాలు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,కార్పొరేటర్లు మల్లికార్జున రాజేందర్,పర్వతాల మల్లేశం,డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సత్య ప్రసన్నారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఎస్ టి సెల్ అధ్యక్షులు శ్రావణ్ నాయక్ కాంగ్రెస్ నాయకులు ఆకుల నరసయ్య, పడాల అజయ్ గౌడ్,వంగల విద్యా సాగర్,యాగండ్ల అనిల్‌కుమార్, ఆనంద్ ,ఎండి సలీముద్దీన్, బొమ్మ ఈశ్వర్ గౌడ్ గడ్డం శ్రీరాములు, మునిగంటి అనిల్ తో పాటు పలువురు నాయకులు హాజరైనారు.ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ముందుకు పోతుంది ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సంబంధించి మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు శాసనసభ్యుల సహకారంతో జిల్లా అభివృద్ధికి బాటలు వేస్తామని, ప్రజా పాలన ప్రభుత్వంలో ప్రజల జీవితాలు రంగుల మయం కావాలని అన్నారు.

# విద్యుత్ లైన్ మెన్లు లోకానికి వెలుగుల శ్రామికులు

**-ఏడిఈ ఎర్రోజు రమేష్**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మార్చి 4 :** ప్రపంచానికి వెలుగులు పంచేందుకు నిరంతరం శ్రమించే నిజమైన శ్రామికుడు ‘విద్యుత్ శాఖ లైన్ మెన్’ అని రామగుండం ఏడిఈ ఎర్రోజు రమేష్ కొనియాడారు. బుధవారం ‘లైన్ మెన్ దివస్’ సందర్భంగా పాలకుర్తి మండలం బసంతనగర్‌లోని జీఎం గార్డెన్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మండల పరిధిలోని లైన్ ఇన్స్పెక్టర్లు ,లైన్ మెన్లు,ఆర్టిజన్లు మరియు స్పాట్ బిల్లర్లను ఘనంగా సన్మానించారు.విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తామని సిబ్బందితో లైన్ మెన్ దివస్ లో ప్రతిజ్ఞ చేయించారు.విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడం లో లైన్ మెన్ల పాత్ర వెలకట్టలేనిదని అధికారులు ఈ సందర్భంగా గుర్తుచేశారు.ఇంకా ఈ కార్యక్రమంలో ఏఈ (ఏఈ) మానాల ప్రసాద్, సబ్ ఇంజనీర్ రాజ్ కుమార్ మరియు ఇతర విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# నర్సరీ పనులు చురుకుగా చేయాలి



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మార్చి 4 :** ఉపాధి హామీ పథకంలో నర్సరీలో మట్టి నింపి పనులు చురుకుగా చేయాలని పెద్దపెల్లి ఏపిడి సత్యనారాయణ కోరారు.మంథని మండలం కన్నాలా గ్రామపంచాయతీ పరిధిలో నర్సరీని సందర్శించిన పెద్దపల్లి ఏపీ డి సత్యనారాయణ ఈ సందర్భంగా సత్య నారాయణ మాట్లాడుతూ నర్సరీ మొక్కలకు రోజుకు రెండుసార్లు వాటర్ పట్టాలని లాస్ట్ ఇయర్ ఉన్న చెట్లను కూడా వాటర్ పట్టించాలని ఫీల్డ్ అసిస్టెంట్ ను కోరారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్ ఏపీవో సదానందం మరియు ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# పేదల బతుకుల్లో సఫా బైతుల్ వెలుగు

**-పవిత్ర రంజాన్ మాసంలో పేదలకు సరుకుల పంపిణీ**
**-వితంతువులకు నెలవారి పెన్షన్లతో ఆసరా**
**-చలికాలంలో కులమతాలకు అతీతంగా రగ్గుల పంపిణీ**
**-దాతల ఆర్థిక సాయంతో కొనసాగుతున్న సేవా కార్యక్రమాలు**
**-సఫా బైతుల్ మాల్ పెద్దపల్లి అధ్యక్షుడు ముఫ్తి ఇంతియాజ్ అసాది వెల్లడి**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (పెద్దపల్లి)మార్చి 4 :** మానవసేవయే మాధవసేవ అనే లక్ష్యంతో.. పేదలకు ఆర్థిక చేయూతనం దిస్తూ, వారి ముఖాల్లో కొత్త వెలుగులు తీసుకొస్తోంది పెద్ద పల్లి పట్టణ సఫా బైతుల్ మాల్ శాఖ.. ముస్లింలు అత్యంత పర్వదినంగా భావించే పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఆ నెలంతా పండగలా భావిస్తారు. కానీ తామున్న ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఒక్కరోజు పండుగ జరుపుకోవడమే కష్టంగా భావించే పేద వర్గాలకు రంజాన్ మాసానికి సరిపడా నిత్యావసర వస్తువులను అందించి వారి ముఖాల్లో కొత్త వెలుగులు నింపుతోంది. ఈ సంస్థ... ముఖ్యంగా పెద్దపల్లి పట్టణంలోని వితంతువులకు నెలవారి పెన్షన్లు, శీతాకాలంలో కుల మతాల కతీతంగా బ్లాంకెట్ల పంపిణీ, పవిత్ర రంజాన్ మాసంలో పేదలకు వంట సామాగ్రి పంపిణీ, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు మందులకు ఆర్థిక సాయం, పేద యువతుల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం చేస్తూ పేద కుటుంబాలకు ఆసరగా నిలుస్తూ, పేదల కోసం మరిన్ని మౌలిక వసతుల కల్పనకు తోడ్పాటునందిస్తోంది. సంస్థ స్థాపించిన 06 సంవత్సరాలుగా సఫా బైతుల్ మాల్ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు, పలువురు దాతలు ఆర్థిక సాయం అందిస్తూ తోడ్పాటు నందిస్తున్నట్లు ముఫ్తి ఇంతియాజ్ అసాది తెలిపారు.

**రంజాన్ మాసంలో :**

నిరు పేదలు పవిత్ర మాసంగా భావించే రంజాన్ మాసంలో పేద కుటుంబాల వారికి నెల రోజులకు సరిపడా నిత్యావసర సరకులు అందిస్తున్నారు. 2020లో సంస్థ స్థాపించినప్పటి నుంచి నేటి వరకు గత 06 సంవత్సరాల్లో ఏటా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో 150 కుటుంబాలకు చేయూతనందిస్తున్నారు.

**వింతంతు, దివ్యాంగులకు పింఛన్లు:**

పెద్దపల్లి పట్టణంలో నివసిస్తున్న పేద వర్గాలకు చెందిన వితంతువులు, దివ్యాంగులతో పాటు పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలను గుర్తించి నెల, నెలా కొంత మొత్తాన్ని వారికి పింఛన్లుగా అందించి వారికి ఆర్థిక చేయూత నందిస్తూ అండగా నిలుస్తున్నారు.

**జకాత్ ద్వారా ఆర్థిక వెసులుబాటు :**

రంజాన్ సందర్భంగా సంపన్న కుటుంబాల వారు జకాత్ పాటిస్తారు. జకాత్ అంటే తాము సంపాదించిన దాంట్లో రెం డున్నర శాతం పేద వర్గాలకు ఖర్చు చేయాలి. ఇలా జకాత్ ద్వారా ఏటా సంస్థకు కొంత నిధులు వస్తాయని, హిరా సంస్థ చైర్మన్ సహా పలువురు దాతలు సంస్థ నిర్వహణకు ఇతోధికంగా ఆర్థిక సాయం అందిస్తున్నారని ముఫ్తి ఇంతియాజ్ తెలిపారు. మరిన్ని వివరాలకు..8790087800 ఈ ఫోన్ నెంబర్ ను సంప్రదించాలన్నారు.



# కెసిఆర్ తీసుకున్న రివర్స్ పంపింగ్ నిర్ణయం రైతులకు వరం

**-బిఆర్ ఎస్ నాయకులు సంఘం సాగర్,ఫిసు తిరుపతి రెడ్డి**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం మార్చి (04) :** తెలంగాణ రాష్ట్రంలో నీటి వనరుల సమర్థ వినియోగానికి ముందుచూపుతో మాజీ సీఎం కెసిఆర్ తీసుకున్న రివర్స్ పంపింగ్ నిర్ణయం రైతులకు గొప్ప వరం అని సినియర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ లు సంఘం సాగర్,ఫిసు తిరుపతి రెడ్డి లు అన్నారు.బుధవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో మాట్లాడుతూ రివర్స్ పంపింగ్ నిర్ణయ ఫలితమే నేడు పలు ప్రాంతాల్లో రైతులకు ప్రజలకు స్పష్టంగా కనిపిస్తోందని ఒకప్పుడు ఎండిపోయి నిస్సారంగా కనిపించిన పంటపొలాలు ,ప్రస్తుతం సాగునీరు అందడంతో పచ్చగా కళకళలాడుతున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.రాష్ట్ర అభివృద్ధి దృష్ట్యా చేపట్టిన ఈ రివర్స్ పంపింగ్ విధానం ద్వారా వరద కాలువలోకి నీటిని మళ్లించడం వల్ల నీటి కొరత తీవ్రంగా ఉన్న ప్రాంతాలకు ప్రాణాధారంగా మారడం ముఖ్యంగా కోరుట్ల, వేములవాడ,చొప్పదండి నియోజకవర్గాల రైతులకు ఈ ప్రాజెక్ట్ ద్వారా సమృద్ధిగా సాగునీరు అందుతోందని రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే లక్ష్యంగా కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు ముందు చూపు నాయకత్వానికి నిదర్శనమన్నారు .కెసిఆర్ ఎప్పటికీ ప్రజలలో చిరస్మరణీయంగా నిలిచిపోతారన్నారు.

# నాగపెల్లి లక్ష్మి నరసింహాస్వామిని దర్శించుకున్న మంత్రి అడ్లూరి

**చురకలు, విలేఖరి, వెల్గటూర్, మార్చి 04 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కిషన్ రావుపేట నాగపెల్లి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ బ్రహ్మోత్స వాల్లో బుధవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి అభివృద్ధి కమిటీ,అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు.మెట్లదారిా గుట్టపైనున్న ఆలయానికి చేరుకొని లక్ష్మీ సమేత నరసింహాస్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు గావించి మొక్కులు తీర్చుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరికి అర్చకులు వేదోక్త ఆశీర్వచనం తోపాటు స్వామివారి శేషవస్త్రం,చిత్రపటాన్ని బహూకరించారు. జాతర ఏర్పాట్లు, సౌకర్యాలు ఆలయ అభివృద్ధిపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రాబోయేరోజుల్లో ఆలయాన్ని మరింత అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటా మన్నారు. ఈకార్యక్రమం లోస్థానిక సర్పంచ్ కుమ్మరి సునిత వెంకటేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాటిపర్తి శైలెందర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ నైనాల అజయ్,ధర్మకర్తలు, పురప్రముఖులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## బాధ్యతలు స్వీకరించిన ఎన్హెచ్ఆర్‌సిఐ కన్వీనర్



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మార్చి 4 :** ఎన్ హెచ్ ఆర్ సి ఐ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్‌గా జంగపల్లి యశ్వంత్ బాధ్యతల స్వీకరణ (ఎన్‌హెచ్ఆర్‌సిఐ) తెలంగాణ రాష్ట్ర కన్వీనర్‌గా జంగపల్లి యశ్వంత్ నియమితులయ్యారు.ఈ మేరకు ఆయన బుధవారం రోజు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భం గా యశ్వంత్ మాట్లాడుతూ..తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించిన జాతీయ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.రాష్ట్రంలో మానవ హక్కుల పరిరక్షణకు,సామాన్యులకు అండగా నిలవడానికి తనవంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.బాధిత వర్గాలకు న్యాయం జరిగేలా చూడటం. మానవ హక్కుల ఉల్లంఘనలపై ఎప్పటికప్పుడు స్పందించడం.ప్రజల్లో హక్కుల పట్ల అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు.

## డీజే ఆపమన్న పోలీసులపై దాడి

**-నలుగురిపై కేసు నమోదు**

**చురకలు ప్రతినిధి కోరుట్ల, మార్చి 04 :** 3-3-2026 రాత్రి సుమారు 11 గంటల సమయంలో కోరుట్ల పట్టణంలో హెడ్‌కానిస్టేబుల్ లింబాద్రి,కానిస్టేబుల్ గంగాధర్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.ఈ క్రమంలో భీముని దుబ్బ సమీపంలో కొంతమంది వ్యక్తులు డీజే ఏర్పాటు చేసి డాన్స్ చేస్తున్నారనే సమాచారం అందింది.దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు డీజే ఆఫ్ చేసి అక్కడి నుండి వెళ్లిపోవాలని వారిని కోరారు.అయితే వారు పోలీసుల మాట వినకుండా డాన్స్ కొనసాగించారు.ఈ సందర్భంగా పరిస్థితిని రికార్డు చేయడానికి హెడ్ కానిస్టేబుల్ లింబాద్రి తన మొబైల్ ఫోన్‌లో వీడియో తీయడం ప్రారంభించగా, కోరుట్లకు చెందిన గడల విజయ్,డీజే రమేష్,దినకర్,మహేందర్ అనే నలుగురు వ్యక్తులు అతని ఫోన్ లాక్కొని కింద పడేశారు.ఫోన్‌ను తిరిగి తీసుకునేందుకు ప్రయత్నించిన కానిస్టేబుల్ గంగాధర్‌ను కాలర్ పట్టుకుని నెట్టివేసి,విధి నిర్వహణ కు ఆటంకం కలిగించారు.ఈ ఘటనపై హెడ్ కానిస్టేబుల్ లింబాద్రి ఫిర్యాదు మేరకు సంబంధిత నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పియంపి భవన నిర్మాణంకు స్థలం కేటాయించాలి



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం మార్చి (04) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీం పట్నం మండల కేంద్రంలో ఆర్ యం పి,పియంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో నుతనంగా ఏర్పాటు చేసుకునే భవన నిర్మాణం కోసం ప్రభుత్వ భుమిని కేరాయిం చాలని ఇబ్రహీంపట్నం తహశీల్దార్ వరప్రసాద్ కు గురువారం ఇబ్రహీంపట్నం మండల ఆర్ యం పి,పియంపి అసోసియేషన్ అధ్యక్షుడు తరి మల్లికార్జున్ ,ప్రధాన కార్యదర్శి శ్రీధర్,కోశాధికారి గుడ రమేష్,ఆర్ యం పి అవుల్ల లక్ష్మణ్‌లు కలిసి వినతిపత్రం సమర్పించి స్థలం కేతాయించాలని కోరారు.స్పందించిన తహసిల్దార్ ప్రభుత్వ భూమిని పరిశీలించి,కేటాయింపు కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు.అసోసియేషన్ ఆధ్వర్యంలో తహశీల్దార్‌ను శాలువతో సన్మానించారు.ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ పండుగకు ఈద్గాలో ఏర్పాటు చేయాలి



**చురకలు విలేకరి, జగిత్యాల,మార్చి 4 :** పవిత్ర రంజాన్ పండుగ కు జగిత్యాల పట్టణంలోని ఈద్గాల్లో అన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ 33వ వార్డు కౌన్సిలర్ పంబాల సుజాత రాము బుధవారం జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ సమీంద్ర వాణి శ్రీనివాస్కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ వాణి శ్రీనివాస్ మాట్లాడుతూ రంజాన్ పండుగకు మున్సిపల్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తామని,ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.

